## మినీకథ

సంక్రాంతి సెలవుల తర్వాత, కార్యాలయాలూ, కాలేజీలూ అన్నీ ఒక్కసారే తెరవడం చేత .... పట్టణాలకు వెళ్ళే ఉద్యోగస్థులు, స్టూడెంట్లతో బస్సులు నిండుతూ జనం కిటకిటలాడుతున్నారు.

నేను ఎదురు చూస్తున్న బస్సు వచ్చి స్టాండులో ఆగింది.

గబగబా సూట్‌కేసు తీసుకొని అందులో ఎక్కేశాను. నా వెనుకనే ఒక అరవై ఏళ్ళ ముసలాడూ, ఒక యిరవై యేళ్ళ యువకుడూ ఎక్కారు. ముందు స్త్రీల సీట్లలో ఖాళీ లేకపోవడంచేత వెనక్కు వెళ్ళాను. అక్కడ ముగ్గురు కూర్చునే సీటొకటి పూర్తిగా ఖాళీగావుంది. ఆ సీట్లో, విండో దగ్గర కూర్చున్నాను. నా వెనుక ఎక్కిన ముసలాడు కూడా.... నేను కూర్చున్న సీట్లోనే నా ప్రక్కన కూర్చున్నాడు. ఆ యిరవై ఏళ్ళ యువకుడు కూడా.... అదే సీట్లో ముసలాయన ప్రక్కన కూర్చున్నాడు.

బస్సు యింకా కదలలేదు.

ఎవరో ఒక ముష్టివాడు బస్సెక్కి అడుక్కోవడం మొదలెట్టాడు. కొందరు ప్రయాణీకులు తమకు తోచినంత ఆ ముష్టివాని సత్తుగిన్నెలో వేస్తున్నారు. చిల్లర యివ్వనివాళ్ళు మౌనంగా ఉండిపోతున్నారు. ఆ ముష్టివాడు మెల్లగా అడుక్కుంటూ మా సీటుదగ్గరికొచ్చాడు. నా వానిటీ బాగ్‌లోంచి పదిపైసలుతీసి వాడి గిన్నెలో వేశాను నేను.

"అబ్బబ్బ! ఈ ముష్టివాళ్ళతో పెద్ద న్యూసెన్స్ అయిపోయింది. ఎక్కడ చూసినా వీళ్ళే. బస్టాండ్లలో, హోటళ్ళ ముందు.... రైల్వేస్టేషన్లలో.... ఒక్క మాటలో చెప్పాలంటే.... ఈ ముష్టి వెధవలు సర్వాంతర్యాములు. ఈ దేశం ముష్టివాళ్ళ విషయంలో మాత్రం గొప్ప అభివృద్ధిని సాధించింది. అసలు యిలాంటివాళ్ళు కోకొల్లలుగా తయారవుతున్నారంటే కారణం మనమే! ముష్టివాడికి ఏమీ యివ్వకపోతే ... ప్రక్కవాడు ఏమనుకుంటాడో ఏమోనని ప్రిస్టేజి ఫీలై.... పది పైసలనుంచి రూపాయలవరకు దానం చేసేస్తున్నారు కొందరు. కానీ అలాంటివారే ఈ దేశంలో ముష్టివాళ్ళను ప్రోత్సహిస్తున్నారనే విషయం వాళ్ళకు తెలియదు", అంటూ మా సీట్లో చివర కూర్చున్న ఆ యిరవై ఏళ్ళ యువకుడు పెద్ద ఉపన్యాసంయిస్తూ.... ఈ దేశంలోని ముష్టివాళ్ళనూ, వాళ్ళకు పైసలు దానం చేసే వారిని దుమ్మెత్తి పోస్తున్నాడు. ఆ యువకునికి అనుగుణంగా ప్రక్క సీట్లోని వాకాయన తందానతాన కొడుతున్నాడు.

బస్సు శరవేగంతో వెళుతోంది.

కొందరు ప్రయాణీకులు సీట్లు లేకపోవడంవల్లా నిలబడే వున్నారు. పెరిగిపోతున్న ఆర్. టి. సి. ఛార్జీలను గురించి, హోటళ్ళ రేట్లను గురించి, ధరలను గురించి, రాజకీయాలను గురించి బస్సులో రకరకాలుగా మాట్లాడుకొంటున్నారు ప్రయాణీకులు. నేను మౌనంగా వింటూ, అందర్నీ పరిశీలనగా చూస్తున్నాను.




# ముష్టి

"బాబూ! తమరెందాకా యెల్తున్నారు?" అడిగాడు నా ప్రక్కన కూర్చొని వున్న అరవై ఏళ్ళ ముసలాడు ఆ యువకుడిని. వాళ్ళిద్దరి చేతుల్లో కండక్టర్ యిచ్చిన టికెట్లున్నాయి.

"రేణిగుంట వరకు—ఏం" అన్నాడా యువకుడు విసుగ్గా ముఖంపెట్టి. "ఏం లేదు బాబూ! ఊరకే అడిగాను. నేనూ ఆ వూరికే ఎల్తున్నాన్లే. ఈ టిక్కెట్టు చూడు బాబూ. నేను ఇరవై రూపాయల నోటిచ్చినా. చిల్లర అడిగితే టిక్కెట్టు ఎనకాల రాసినాను దిగేటప్పుడు తీసుకో అన్నాడు కండక్టర్" అంటూ ఆ ముసలాడు తన టికెట్టును ఆ యువకుని చేతికందించాడు.

"కండక్టర్ దగ్గర చిల్లర లేదట. నాకూ రూపాయి యివ్వాల్సి వుంటే టిక్కెట్టువెనుక రాశాడు. నీటిక్కెట్టువెనుక పదహారు రూపాయల చిల్లర రాసి వుంది. దిగేటప్పుడు తీసుకో టిక్కెట్టు జాగ్రత్త" అన్నాడా యువకుడు ముసలాడి చేతికి టిక్కెట్టు యిస్తూ.

రేణిగుంట ముందు స్టాపింగ్‌లోనే ఆ యువకుడు దిగేశాడు. బస్సు రేణిగుంట సమీపానికి రావడంతో కండక్టర్ బస్సులో ప్రయాణీకులకు తను యివ్వాల్సిన చిల్లరను టికెట్ వెనుక చూసి యిచ్చేస్తున్నాడు. నా ప్రక్కనున్న ముసలాయన టికెట్ అందించాడు కండక్టర్‌కి. ఆ టికెట్ వెనుక నోట్ చేసినచిల్లరనుచూసి ఒక రూపాయి అందించాడు కండక్టర్. "అదేమిటి రూపాయిస్తున్నారు? నేను ఇరవై రూపాయల నోటిచ్చినాను బస్సెక్కినప్పుడు. నాకు పదహారు రూపాయలివ్వాలి" అంటూ గొడవ చేశాడు ముసలాయన

"నీకు పిచ్చా ఏమిటి? నీ టికెట్ వెనుక చిల్లర ఒక్క రూపాయి మాత్రమే

> **అంకితం**
>
> దిక్కుల్లో ఐక్యమైపోయిన నాటి నా నేస్తానికి.... —వీణావాణి

వ్రాసింది. నువ్వు నిజంగా యిరవై రూపాయలు యిచ్చివుంటే.... టికెట్ వెనుక పదహారు రూపాయల చిల్లర రాసుండేవాణ్ణి -మీరుచూడండి మేడం! ఈ టికెట్ వెనుక ఎంత చిల్లర వ్రాయబడివుందో" అంటూ కండక్టర్ ఆ టికెట్‌ను నా చేతికందించాడు. తీసుకొని చూశాను. అందులో కేవలం ఒక్క రూపాయి చిల్లర మాత్రమే వ్రాయబడి వుంది.

బస్సు రేణిగుంట స్టాండులో ఆగింది.

ఆ ముసలాడికీ, కండక్టరుకీ మధ్య రగడ మరీ పెద్దదైంది. నాకు అనుమానం వచ్చింది. బస్‌లో ఆ ముసలాడు, అంతకు ముందు స్టాపింగ్‌లో దిగిపోయిన ఆ యిరవై ఏళ్ళ యువకుడూ మాట్లాడుకొన్న మాటలు గుర్తుకొచ్చాయి. అంటే.... ఇది అలా.... అవును సందేహం లేదు.

ముష్టి ఎత్తుకొంటున్నవాణ్ణి చూసి అసహ్యించుకొని ... ఈ దేశంలోని ముష్టివాళ్ళనందర్నీ దుమ్మెదులిపిన ఆ యువకుడు.... భారత పౌరుడు.... యిప్పుడు చేసిందేమిటి?

—వీరపల్లె వీణావాణి